# జోలపాట

"శోభశ్రీ"

"నిదురపో
నిదురపో
నా చిట్టి తండ్రీ!
నిదురపో,
ఏడువకు, ఏడువకు,
నిదురపో.
మురిపాలుగొలిపే ... ... "

లక్ష్మి తన సంవత్సరం వయస్సుగల చిన్నికొడుకు బాబుని బుజాన పడుకోబెట్టుకొని, ఒక చేతితో నూలు యంత్రాన్ని త్రిప్పుతూ జోలపాట పాడుతోంది.

ఆ చిన్నారి చిట్టిబాబు ఎప్పటికైనా నిద్రపోతాడా ?

"నిదురపో,
నిదురపో
నా చిట్టితండ్రీ
నిదురపో ... ... "

ఆ రోజు బాబు శరీరం సలసలా కాగిపోతోంది. బాబుని బుజంమీాద పడుకోపెట్టుకున్నప్పుడు ఆ వేడి ఈమె శరీరానికి గూడ సోకుతోంది. జ్వరంతో బాధపడుతున్నాడు బాబు. ఆ రోజంతా కన్ను మూాయ లేదు. ఏడుపు మూాలుగులతోనే కాలం అంతా గడిపాడు.

ఆ యంత్రం 'భక్ భక్' అని మ్రోత చేస్తున్నది. తోలుపటకా అదొక విధమైన మ్రోత నందిస్తోంది – ఛోట్లులు 'కిర్ కిర్' మనే శబ్దం చేస్తున్నాయి. అంతదాకా ఎందుకు! భూమంతా గజగజా వణికిపోతున్నదన్నట్లనిపిస్తున్నది ఆ శబ్దానికి.

యంత్రాన్ని గిరగిరా త్రిప్పుతోంది బలాన్నంతా కూడగట్టుకొని రెక్కలు పిండైపోతున్నా లెక్కచేయకుండా పొట్టకోసం - జానెడు పొట్టకోసం. బాబు – తన సర్వస్వం, జ్వరంతో మూాలుగుతూ బుజంమీాదపడివున్నా – రాట్నాన్ని త్రిప్పుతునే వున్నది.

"నిదురపో
నిదురపో .... .... "

తిరిగి బాబును జోగొట్టింది.

ఆ నూలు ఫ్యాక్టరీలో అందరి కూలీలతోబాటు ఆమె ఒకతె. దూాదితోగూడిన దుమ్ము లక్ష్మి ముఖాన్నంతా కప్పి వేసింది – ఆమె ముఖమేగాదు, ఆ ఫ్యాక్టరీగోడలు,

యంత్రాలు, నేల గూడ. ఆమె కళ్ళతో కొద్దిగా కష్టంమీద ముఖాన్ని ముక్కుమీదుగా చూచుకుంది. ముఖమంతా తెల్లటి దూదితో వికృతంగావుంది.

"ఊఁ, ఊఁ ... " అంటూ మూలిగాడు బాబు. అంత మ్రోతలోగూడ బాబు మూలుగు ఆమె హృదయాన్ని అందుకోగలిగింది.

"నిదురపో
నిదురపో
రత్నాల తండ్రీ,
నిదురపో,
ఏడువకు, ఏడువకు
నిదురపో ... ... "

తన పాత పాటనే తిరిగి మొదలుపెట్టింది. బాబు తలను తన ముఖంవద్దకు జేర్చుకొని కన్నీటితోనే ముద్దుపెట్టుకుంది. ... తిరిగి యంత్రపు నడకలో లీనమైపోయింది.

ఫ్యాక్టరీలో పని త్వర త్వరగా సాగేందుకుగాను, ఎవరో ఒక స్త్రీ పాట ఎత్తుకుంది హుషారుగా ... ...

"గిరగిరా
గరగరా
తిరుగుతూ
పరుగెత్తె
రాట్నమా,
ఓహో రాట్నమా ... "

లక్ష్మి, కన్నీటిచారలు కట్టినకళ్లు యంత్ర పరికరాలనన్నిటిని పరిశీలించి పాటపాడిన ఆమెవైపు తిరిగినయి.

తిరిగి మామూలుమ్రోత ఆ ఆవరణను ఆవరించింది.

ఆమె హృదయం ఆ మ్రోతకు మొరటుబారింది. ఆ శబ్ద వాతావరణంలోనే ఆమె హృదయంలో నిశ్శబ్ద మావరించి, పూర్వస్మృతుల నొక్కొక్కటిని తొలియసాగింది.

పన్నెండు నెలలక్రితం బాబు జన్మించాడు - చిన్నిపొట్టతో సన్నని గొంతుకతో, పాలుగారే బుగ్గలతో ... అవును! తన ప్రేమమూర్తి ... ఇప్పుడేం చేస్తున్నారో ... ఆ రోజు తనను తీసుకొచ్చేనాడు ... నీవేనా సర్వస్వం అన్న 'ఆయన' ఏంచేస్తున్నారో ... నిజమే! తను చాలా దూరంనుండి, తల్లిదండ్రుల నొదులుకొని, తీయని మాటలు చెప్పిన పాపిష్టి ముఖాని కాశించి పారిపోయివచ్చింది.

ఆ నల్లనికళ్ళు, విశాలమైన నుదురు, నొక్కుల నొక్కులజుట్టు - తనకిశోర్, తన భర్త, తన అందాలరాశి, ఆశాసౌధం, తన సర్వస్వం ... కాని ... కాని తన ఆశలు

మొదలు నరికిన చెట్టులా కూలిపోయాయి, గాలిమేడలులాగా ఎగిరిపోయాయి.

బాబు కళ్లుగూడ ఆయన కళ్లులాగానే వుంటయి ... అసలు బాబే ఆయన .... కాని ఆయనను తెలియకుండానే వెళ్ళిపోయాడు–తానొక తండ్రి అవ్వబోతున్నాడని. మెరుపులతో వచ్చి తనకు వెలుగు చూపి, తనను లోయలోకి త్రోసివేస్తూ ఉరుములతో వెళ్ళిపోయాడు.

మొదట్లో అతడెక్కడికి పోయాడోనని ఆశ్చర్యపోయింది. క్రిందటి ఎండాకాలంలో తనవద్దే వున్నాడు, తీయని మాటలు చెబుతూ, అతనికోసం నిరీక్షిస్తూ ఆకాశంలోకి ఆశతో చూచేది ... కాని ఆశూన్యప్రదేశంలో ఈమెకి కనబడేది శూన్యం ... బాబు ఆమె బుజాలమీద తప్ప! అప్పటినుండి ఆమె కార్చేకన్నీరుకు ఆమె బుగ్గలమీద దారులు ఏర్పడ్డాయి.

"నేను ముసలిదాన్ని అయిపోతున్నాను ......" ఆమె ముఖాన్ని చేతితో తడిమి చూచుకొని అప్పుడప్పుడు అనుకుంటుండేది.

"ఊఁ ఊఁ ..." తిరిగి బాబు మూలిగాడు.

వెంటనే ఆమె హృదయంలో బ్రాహ్యాపు మోత కూడింది.

"బాప్ రే బాప్ ! ఏమిటీ ఈ గొడవ ...పిల్లవాడిని ఒక్క నిముషంగూడ ఏడ్వకుండా ఉంచలేవు" అని ప్రక్కనున్న కూలీ విసుక్కుంది.

తిరిగి కిశోర్ జ్ఞాపకమొచ్చాడు లక్ష్మికి. కిశోర్ని చూచి చాలా రోజులయింది ... అదంతా ఒక కలగా జరిగిపోయింది ... ఇప్పుడేం చేస్తున్నాడో ... ? స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ ఏ స్త్రీ జీవితాన్ని నాశనం చేస్తున్నాడో ? ...

బాబుని క్రిందపడుకోబెట్టి ముఖంలోకి చూచింది....నిశ్శబ్దంగాపడుకున్నాడు నోరు మూసుకొని ... అది మంచి సమయం... తను ఇంకా త్వరగా యంత్రాన్ని తిప్పగలదు.

"నిదురపో
నిదురపో
నా వరాలమూట..."

పాతపాటను గొణిగింది .... తిరిగి జీవం లేని చిరునవ్వుతో బాబుని బుజానవేసుకొని, .. కదలకుండా నిలిచిన కళ్ళను, కొయ్యబారిన చేతులనుచూచి నివ్వెరపోయింది.

లక్ష్మి ఆతృతతో యంత్రాన్ని నిలిపివేసింది.

బాబు వంక నిర్వికారంగా చూస్తూ నిలబడింది.

బాబు చనిపోయాడు !!
విద్యుత్ ప్రహారం తగిలిన దానివలె

తూలిపోయింది. గుండెలు బాదుకుంటూ, ముఖం రక్కుకుంటు విలవిలా ఏడ్వసాగింది.

"అరె...ఏమిటి గొడవ...ఇందాకటి నుండి పిల్లవాడి ఏడుపు...ఇప్పుడు ఈమె." తిరిగి విసుక్కుంది పక్కావిడ.

"నాబాబు! నాబాబు ..." కర్కశ హృదయాలు కరిగేలా, రాతికొండలు పాడి అయ్యేలా వెక్కి వెక్కి ఏడ్చింది ...

ఆడకూలీలంతా అర్థంగాక ఆమె చుట్టు జేరారు.

"ఏమిటి?" అడిగింది మేస్త్రీకూలి. అసలు సంగతి తెలుసుకొని ఆఫీసువైపుకు నడిచింది, లక్ష్మిని, బండ బారిని బాబుని బయటకు నెట్టించేందుకు!

తిరిగి ఫ్యాక్టరీ ఆవరణ యంత్రాల గోలతో నిండిపోయింది.

(ఆధారం: ముల్కరాజ్ ఆనంద్)

---

# వైద్య చికిత్సకు విద్యుచ్ఛక్తి

ఈ మధ్య ఏరోయినోథెరపీ అనే కొత్తచికిత్సాపద్ధతి వైద్యశాస్త్రంలో విస్తృతంగా వాడుకలోకి వస్తోంది. అనేక వ్యాధుల చికిత్సలో మానవశరీరంపై అయోన్స్ అనబడే అతిసూక్ష్మమైన వాతావరణపు విద్యుత్ కణాల ప్రభావాన్ని బరిశీలించిన ఫలితంగా కనుగొనబడిందా పద్ధతి. అయోన్స్, ధాతువులలో జరిగే మోలిక్యులర్ ప్రక్రియలను మార్చగలవు. అందువల్ల ధాతువు (టిస్యూ) యొక్క మెటబాలిజం బాగా మారిపోగలదు. ఇందువల్ల హైపర్ టెన్షన్, ఆస్తమా, ఓజెనా (జలుబువంటివ్యాధి) తదితర తీవ్రవ్యాధుల చికిత్సలో అయోన్స్‌ను ప్రయోగించడానికి వీలవుతుంది. ఏరోఅయోన్స్‌ను కేంద్రీకరించగల ఏరో అయొనైజర్ అనేయంత్రం దీనికి అవసరం. అలాంటి సరియైన యంత్రంలేకపోవడం వల్ల యీ పద్ధతి విస్తృతంగా వాడుకలోకి రాలేకపోయింది. అటువంటి యంత్రాలు ఎంతో ఖరీదైనవిగా వుండేవి. వాటిని తయారు చేయడానికి అరుదుగా లభించేపదార్థాలు అవసరమయేది.

అయితే కాకసస్‌లోని బాల్నియొలాజికల్ సంస్థకు చెందిన ఎ. నికొలెంకో అనే ఒక మెకానిక్కు, ప్రొఫెసర్ ఎ. పి. స్లెజిన్ అనేవారు, కొంతమంది రోగులకు ఒకేసారి చికిత్సచేయగల ఒక ఏరో అయొనైజర్ యంత్రాన్ని తయారుచేశారు. దీనిని సులభంగా మామూలు కార్ఖానాలో తయారు చేయవచ్చును. ఇది చవకకూడాను. దీనితో చికిత్స చాల గుణమిచ్చినట్లు ధృవపడింది. 30 సార్లు చికిత్స పొందేక చాల మంది రోగులకు తలనొప్పులు, గుండెనొప్పులు పోయాయి; వారికి సరిగ్గా ఆకలి వెయ్యడం నిద్రరావడం జరిగింది; పనిచేయగలశక్తి బాగా ఎక్కువైంది.

'టాస్'